ఆర్.డి.టి

ఎకాలజీ సెంటర్, అనంతపురం.

ఈ మాసపు సమాచారం మార్చి 2006

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

- నార్వే దేశంలో ఆర్కిటిక్ పర్వతంపైన ప్రపంచ వ్యాప్తంగా దొరికే 20 లక్షల పంటల విత్తనాల రకాల్ని "డూంమ్స్ డే వాల్ట్" అనే పేరుతో భద్రపర్చబోతున్నారు. ప్రపంచ ప్రళయం సంభవించి జీవరాసులన్నీ నశిస్తే భావితరాలకు పంట విత్తనాల రకాలను అందించే ఉద్దేశ్యంతో అన్ని జాగ్రత్తలతో భద్రపరుస్తున్నారు. భూప్రళయానికి దారితీసే ప్రకృతి వినాశనాన్ని అరికడితే ఈ ప్రమాదం తప్పవచ్చు గదా!
- జపాన్‌లోని ప్రజలను "పని పిచ్చోళ్ళు"గా పరిగణిస్తారు. వీరు నిరంతరం పనిచేయడానికి ప్రయత్నిస్తారని ప్రతీతి. తమ ప్రజల మీద పెరిగిపోతున్న పనిభారాన్ని తగ్గించి వారు విశ్రాంతిని కోరుకునేటట్లు చేయడానికి ప్రభుత్వం ఒక చట్టం తీసుకువస్తోంది. దీని ద్వారా కంపెనీల యజమానులు తమ సంస్థల్లోని కార్మికులను, ఉద్యోగులను విశ్రాంతి కోసం శెలవులు ఉపయోగించుకోవడాన్ని ప్రోత్సహించాలి. జపాన్‌లో సగటున సంవత్సరంలో 18 వేతన శెలవులను కూడా ఉపయోగించుకోవడంలేదట. జపాన్ ప్రజలు శ్రమ సౌందర్యం తెలిసినవారు కావడం కారణం కావచ్చు.
- "కరెంట్ సైన్స్" అనే పత్రిక 10 జనవరి 2006న ఒక వ్యాసం ప్రచురించింది. దీని ప్రకారం దేశంలోని ప్రధాన పరిశోధన సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలు నదుల అనుసంధానం మీద చర్చించి ఒక అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. నదుల అనుసంధానం చేయడంవలన వర్షపు నీరు వరదల రూపంలో వంకలు, నదులలో ప్రవహించడం తగ్గిపోయి దాని ప్రభావం వర్షాపాతం పైన పడుతుందని హెచ్చరించారు. ముఖ్యంగా నదుల ద్వారా బంగళాఖాతం సముద్రంలోకి వెళ్ళే జలమార్గాలు తగ్గిపోయి సముద్రతీరం దెబ్బతింటుందని దీని ఫలితంగా నైరుతి రుతుపవనాల మీద దీని ప్రభావంపడి వర్షపాతం తగ్గుతుందని హెచ్చరించారు.

(డౌన్ టు ఎర్త్, జనవరి 31, 2006 సంచిక నుండి)

**చిట్కా :** అల్లం, సైంధవ లవణం కలిపి నోటిలో ఉంచుకుని రసం మింగుతూ ఉంటే దగ్గు తగ్గుతుంది. వేడి పాలలో అర చెంచా పసుపు కలిపి రెండు పూటలా తాగితే, దగ్గు, జలుబు తగ్గుతాయి.

## ఉపాధి హామీ చట్టాన్ని గురించి మరింత తెలుసుకుందాం - 1

గత మాసంలో ఉపాధి హామీ చట్టం నేపథ్యం గురించి, దాని ప్రాముఖ్యతను గురించి సంగ్రహంగా తెలుసుకున్నాం. ఈ మాసం చట్టం యొక్క అనుకూలతలు, అమలులో మనం అనుసరించాల్సిన పద్ధతులు గురించి వివరంగా చర్చించుకుందాం.

ఏ చట్టమైనా, పథకమైనా, కేవలం ప్రభుత్వాల ప్రకటనలతోనే విజయవంతం కాదు. ఒక పథకం విజయవంతం కావడానికి అది ప్రజలకు ఉపయోగపడేదిగా ఉండాలి. ప్రజలు అందులోని అనుకూలతలు గమనించి ఉపయోగించుకునే వెసులుబాటుకూడా ఉండాలి. ముఖ్యంగా పథకాల అమలులో బాధ్యతగా, నిజాయితీగా పనిచేయగల ప్రభుత్వ యంత్రాంగం ఉండాలి. వీటికి తోడుగా సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు మేలు చేకూర్చే విధంగా రాజకీయ వాతావరణం ఉండాలి. కలుషిత గ్రామ రాజకీయ వాతావరణం, ప్రజల ప్రయోజనంకంటే రాజకీయ ప్రయోజనాలు మిన్నగా భావించే రాజకీయ నాయకుల తెంపరితనం పథకం సజావుగా సాగడానికి అడ్డంకిగా ఉంటాయి. వీటిని అధిగమించి వర్గ, రాజకీయాలకు అతీతంగా ఉపాధికోరే ప్రజలకు లబ్ధిచేకూర్చాలి. ముఖ్యంగా గుర్తుపెట్టుకోవలసింది ఏమంటే ప్రతి పథకాన్ని నీరుగార్చేది, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సైంధవుడిలా అడ్డు తగిలే దళారీ వ్యవస్థ. పని కోసం ప్రజలకు అర్జీలు ఇచ్చుకునే దశలోనే దళారీలు రంగప్రవేశం చేశారు. ప్రజలతో డబ్బులు వసూలు చేసి అర్జీలు పెట్టించారు. గ్రామాలలో మనమే వీరిని గమనించాలి. దళారులను రంగంలోనికి రానియ్యకుండా జాగ్రత్తపడాలి.

### జిల్లాలో ఉపాధి హామీ చట్టం అమలుకు ప్రభుత్వ సన్నాహం :

జిల్లాలోని 63 మండలాలకు ఈ చట్టానికి సంబంధించి ఇది వరకే 14 మంది జిల్లా అధికారులను నియోజకవర్గాలవారీగా స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. ఈ పథకాన్ని అమలుపర్చడానికి, వీటికి సంబంధించిన రికార్డులను నమోదు చేయడానికి అవసరమైన సిబ్బందిని కూడా నియామకం గావించే ప్రయత్నంలో జిల్లా అధికారులు తలమునకలుగా ఉన్నారు. ప్రభుత్వం ఇతర స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా గావించిన ప్రచారం మూలంగా, చాలా చోట్ల అంచనాలకు మించి ప్రజలు పని పత్రాల కోసం దాఖలు చేసుకున్నారు. అధికార యంత్రాంగం వీటిని పరిశీలించి అర్హులైన వారికి పని పత్రాల పంపిణీతోపాటు, చేయబోయే పనుల గుర్తింపు కార్యక్రమంలో నిమగ్నమై ఉంది. పనులను గుర్తించడంలో గ్రామ ప్రజలకు పూర్తి ప్రాతినిధ్యం ఉండాలి. తమ గ్రామానికి ఏయే పనులు ప్రాధాన్యతాక్రమంలో పూర్తి చేసుకోవాలో గ్రామంలోని ప్రజలు చర్చించుకోవాలి. ఈ దశలో గ్రామంలోని కొందరు స్వార్థపరశక్తులు, దళారులు రంగప్రవేశం చేసే అవకాశముంది. ఇలా జరగకుండా జాగ్రత్తపడాలి. →

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

## ప్రభుత్వం పనులకోసం గుర్తించిన రంగాలు :

★ గ్రామమొత్తాన్ని వాటర్‌షెడ్‌గా పరిగణించి వాటర్‌షెడ్ విధానం కింద చేపట్టే పనులు.

★ గ్రామ నెత్తం భూముల్లో, ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన భూముల్లో, భూసంస్కరణలవల్ల లభించిన సీలింగ్ భూముల్లో, చిన్నసన్నకారు రైతుల భూముల్లో పండ్ల చెట్లు, బయోడీజల్ మొక్కలు పెంచడం.

★ ఎస్‌సి, ఎస్‌టిలకు చెందిన భూముల్లో ఇతర అసైన్డ్ భూముల్లో సాగునీటి సౌకర్యాలను అభివృద్ధి చేయడం.

★ సంప్రదాయక నీటి వనరుల పునరుద్ధరణ, సాగునీటి కాలువల్లో పూడికతీయడం, చిన్న తరహా సాగునీటి చెరువుల నిర్మాణం.

## మనం ఆలోచించాల్సినవి.

ఉపాధి హామీ పథకం అమలు అంటే కేవలం కూలీలకు పని కల్పించడమొక్కటే ఏకైక లక్ష్యం కాదు. ఉపాధి కల్పించడానికి పెద్దపీట వేసినా, అంతే మోతాదులో గ్రామంలో వనుల కల్పన, గ్రామంలో ప్రజలందరికీ సంబంధించిన ఉమ్మడి ఆస్థులను అభివృద్ధిపర్చడం కూడా రెండో ప్రధానమైన అంశం. ఉదాహరణకు ఉపాధి కోసం దరఖాస్తు చేసుకున్నవారికి సంవత్సరంలో 100 రోజులకు తగ్గకుండా పనికల్పిస్తే, ఆ కుటుంబాలకు బతుకు తెరువు ఏర్పడుతుంది. గ్రామాల నుండి పట్టణాలకు వలస వెళ్ళే దుర్భర పరిస్థితుల నుండి విముక్తి చెందవచ్చు. అయితే ఈ పనులవల్ల, గ్రామంలోని పనులు కోరేవారికి కాకుండా ఉపాధి కల్పన పథకంలోనికి రానివారు సైతం ఉమ్మడి వనరుల అభివృద్ధి పనుల ఫలితాల్ని అనుభవించాలి. ఉదాహరణకు గ్రామంలోని ఒక చెరువో, ఒక కుంటో నిరుపయోగంగా ఉందనుకుందాం. దానికి వర్షపునీటిని సరఫరా చేసే ఫీడర్ ఛానలు పూడిపోయో, లేదా ఇతరుల అక్రమ ఆధీనంలోనో ఉంటే, ఈ పథకం కింద చేయవలసిన పనిగా గుర్తించి, ఆ చెరువు లేదా కుంటను పునరుద్ధరిస్తే గ్రామ మొత్తానికి ఉపయోగపడుతుంది. పశువులకు, పక్షులకు కూడా ఉపయోగ పడుతుంది. ప్రకృతి సమతుల్యానికి దోహదపడుతుంది. అందుకే ఉపాధి హామీ చట్టం పథకం ఆ పేరుతోనేగాకుండా సమగ్ర గ్రామీణాభివృద్ధి చట్టం అని కూడా మనం పిలుచుకోవచ్చు.

అదే విధంగా మనం ఎంచుకునే పని కూడా పూర్తిగా సమగ్రంగా ఉండాలి. ఉదాహరణకు చెరువుకు తూములు పాడయిపోయి ఉంటాయి. అక్కడక్కడా కట్టలు తెగిపోయి ఉంటాయి. ఇవి మాత్రమే మన కళ్ళకు కనపడుతాయి. అదే విధంగా ఆ చెరువు / కుంటకు నీటినందించే ఫీడర్ ఛానల్లు అదృశ్యమై ఉంటాయి. వీటిని పునరుద్ధరించకుండా, ఉపయోగంలోకి తేకుండా కేవలం తెగిన కట్టల్ని బాగుచేయడమో, తూముల్ని బాగు చెయ్యడమో మాత్రమే చేస్తే, కూలీలకు ఉపాధి కల్పించే ఆశయం నెరవేరవచ్చునుగానీ, చేసిన పనులువల్ల ప్రయోజనం లభించదు. అందుకనే ఎంచుకున్న పని సమగ్రంగా ఉండాలి. ఒక పనిని ఎంపిక చేసుకునే క్రమంలో ఉపాధి అంశంతోపాటు, ఆ పని పూర్తయితే ఏమేరకు గ్రామానికి ఉపయోగపడుతుందని కూడా అంచనా వేసుకోవాలి. ఇటువంటి సంప్రదాయక వనరుల పునరుద్ధరణ పనుల గురించి చర్చించేటప్పుడు తప్పనిసరిగా సలహాలు స్వీకరించాలి. గ్రామంలోని మునుపటి తలారులు, వెట్టి, నీరుకట్టి, తదితరులకు వాటిపట్ల మంచి పరిజ్ఞానం ఉంటుంది. వారి సలహాలను తప్పక తీసుకోవాలి. ఏ పని పూర్తిచేసినా, ఆ పని పూర్తిగా ముగిసిన పిమ్మట, అది పూర్తిగా గ్రామ ఆస్తిగా మారాలి. గ్రామంలోని వారందరికీ ఉపయోగపడాలి.

అదే విధంగా జిల్లాలో ముమ్మరంగా బయోడీజల్ కొరకు కానుగచెట్ల పెంపకాన్ని చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మన జిల్లా వాతావరణంలో పూర్తిగా ఇమిడి పోయేవి వేప, చింత, కానుగ. ప్రస్తుతం వాడుతున్న పెట్రో డీజల్‌కు ప్రత్యామ్నాయంగా కానుగ చెట్లలాంటి ఇతర వృక్ష సంబంధ కాయల ద్వారా బయోడీజల్ ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఉపాధి హామీ చట్టం కింద కానుగ చెట్ల పెంపకం కూడా వస్తుంది. చాలా కుటుంబాలకు దీనివల్ల ఉపాధి లభిస్తుంది. త్వరలోనే బయోడీజల్ ప్లాంటు కూడా మనకు దగ్గరలోనే నెలకొల్పే అవకాశముంది. బంజరు భూములు, సాగుకు అంతగా లాయకుకాని భూములు, మట్టితో కప్పబడిఉన్న గుట్టలు తదితర ప్రాంతాలలో ఈ కానుగచెట్ల పెంపకాన్ని చేపట్టవచ్చు. దీనిని కూడా ఒక పనిగా గ్రామ సభలో గుర్తిస్తే, ఏ రకంగా పెంచాలో, మొక్కలు ఎక్కడి నుండి సరఫరా అవుతాయో అన్నీ అధికారులు ఏర్పాటు చేస్తారు. ముఖ్యంగా ప్రతి సందర్భంలోనూ దీనిని ఒక ప్రభుత్వ పథకంగాకాక మన స్వంత కార్యక్రమంగా, గ్రామాభివృద్ధికి, మనకు మేలుకలిగే పథకంగా భావించాలి, పట్టుదలగా అమలులో ఎదురయ్యే లోటుపాట్లను అధిగమించి అధికారులతో సహకరించాలి. వారితో నిజాయితీగా పని చేయించుకోవాలి. పనుల ఎంపికలోనూ, గ్రామ సభల సందర్భంగానూ ఎలాంటి రాజకీయాలకు తావియ్యరాదు. వ్యక్తిగత అహంకారాలకు, పట్టుదలలకు గ్రామ ప్రయోజనాలు బలయ్యే దుర్మార్గ పరిస్థితిరానియ్యరాదు. ప్రజలకు సేవచేయడానికి ఏర్పడిన రాజకీయ పార్టీలు పత్రికలలో ఎక్కడానికి చేసే ప్రయత్నం కన్నా, పథకాన్ని సమర్థవంతంగా అమలు అయ్యే విధంగా అధికార యంత్రాంగంమీద ఒత్తిడి తేవాలి. గ్రామాల్లో ప్రజలుంటేనే తమకు ఓట్లు వస్తాయని భావించాలి.

మీ శ్రేయోభిలాషి,

**వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి**

## నీతి వాక్యం :

ఆ॥ ధనము కూడఁబెట్టి దానంబుచేయక
తానుదినక లెస్స దాఁచుగాక తేనె
టీఁగ గూర్చి తెఱువరి కియ్యదా
విశ్వదాభిరామ వినుర వేమా !

## తాత్పర్యము:

లోభి ధనమును గూడబెట్టి, దానములు చేయకుండా, తానునూ తినకుండా దాచుకుంటాడు. అటువంటి ధనమువలన ఎవ్వరికి ప్రయోజనము కలుగదు. తేనేటీగ తాను అనేక పూపొదల నుంచి సేకరించి తెచ్చి ఒక చోట దాచిన తేనెను బాటసారి దానిని కైవసం చేసుకుంటాడు. అట్లాగే లోభి తాను తినక, ఇతరులకు ఇవ్వక దాచిన సొమ్ము దుర్మార్గుల పాలవుతుందని తాత్పర్యం.

## చర్చ :

సంపద కూడ బెట్టుట తప్పు కాదు. అయితే కూడబెట్టిన సంపద ఎవరికో ఒకరికి ఉపయోపడాలి. కనీసం కష్టపడి కూడబెట్టిన వారికైనా ఉపయోగపడాలి. సంపదకు మూలంగా పరిగణించబడుతున్న బంగారానికి వన్నె తప్ప సువాసన లేదు. అందుకే సంపద కలిగిన వ్యక్తి తనకున్న జ్ఞానంచేత సామాజిక బాధ్యతగా వృధాగా ఉన్నటువంటి సంపదతో ఇతరులకు సాయపడినప్పుడు, కష్టాలలో ఆదుకున్నప్పుడు ఆ వ్యక్తిని సువాసన కలిగిన బంగారంగా అభివర్ణిస్తారు. తాను తినక, ఇతరులకు చేయి విదల్చక, సాయపడని లోభి సంపద చివరికి దుర్మార్గుల పాలవుతుంది. పువ్వుల చుట్టూ తిరిగి మకరందాన్ని సేకరించి తేనేటీగలు దాచిన తేనెను దారిన పోయే వ్యక్తి గమనించి ఏ మాత్రం కష్టపడకుండా దానిని స్వంతం చేసుకుంటాడు. లోభి సంపద కూడా అలాగే అటువంటి స్వార్థపరుల పాలవుతుంది.

ఇక్కడ సాయపడడమంటే, పని చెయ్యడానికి ఇష్టపడని సోమరులను పోషించడంకాదు. అటువంటి సాయం సమాజానికి మేలు చేయకపోగా కీడు చేస్తుంది. సృష్టిలోని ప్రతి వ్యక్తి, ప్రతి ప్రాణి పనిచేయాలి. కష్టపడే క్రమంలో చేయందించడం తప్పుకాదు. కష్టాలలో ఆదుకోవడం తప్పుకాదు. ఒక వ్యక్తి శారీరక శ్రమ చేయకుండా సంపదను ఒకే చోట కేంద్రీకరిస్తున్నాడంటే, అతను ఇతరులకు చెందవలసిన సామాజిక సంపదను తానొక్కడే అనుభవిస్తున్నాడన్నమాట. ప్రతి సంపాదనా సమాజంలోని ఉత్పత్తి వనరులమీద ఆధారపడి ఉంటుంది తప్ప ప్రత్యేకంగా ఉండదు. సృష్టికి మూలకారణమైన భగవంతుడు ప్రకృతి వనరులను, ప్రకృతి సంపదలను అందరికీ సమంగా అనుభవించడానికే సృష్టించాడు, భగవంతుడు అందరివాడు అయినప్పుడు సంపదలు మాత్రం కొద్దిమందికే ఎందుకు పరిమితమౌతాయి ? అంటే మనము భగవంతుని నియమాల్ని, తద్వారా ప్రకృతి నియమాల్ని ఉల్లంఘిస్తున్నామన్నమాట. అందుకే సంపద నా ఒక్కడిదే అన్న భావనకంటే, ఈ సంపదలో సమాజానికి భాగముందిఅన్న భావనతో సమాజానికి తోడ్పడాలి. తేనెటీగలు ఐకమత్యంతో పువ్వులలోని మకరందాన్ని సేకరించి కష్టపడుతున్నట్లుగా ప్రతి ఒక్కరూ కష్టపడాలి. సమాజ సంపదను పెంచడానికి తోడ్పడాలి. ఉపయోగంలో ఉన్నప్పుడే సంపదకు సాఫల్యం చేకూరుతుంది.

వై.వి. మల్లారెడ్డి

## గొర్రెలలో నీలి నాలుక, పి.పి.ఆర్ వ్యాధులకు హోమియో చికిత్స

గత మూడు నాలుగు మాసాలుగా గొర్రెలు, మేకలలో నీలి నాలుక (బ్లూటంగ్) రోగాలు సోకి గణనీయమైన నష్టాలు కలుగజేశాయి. వ్యాధి సోకిన జీవాలు నోటి పుండ్లతో బాధపడతాయి. చూడిగొర్రెలు, మేకలు ఈసుకుపోవచ్చు (గర్భాలు తొలగిపోవచ్చు). చిన్న పిల్లలు చనిపోవచ్చు. మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌లోని కొందరు పశు వైద్యులు హోమియో మందులు వాడి సత్ఫలితాలు పొందగలిగారు. ఆ వివరాలు తెలుసుకుందాం.

### హోమియో మందులతో చికిత్స :

1. ఎకినేషియా మదర్ టించర్ - 30 మి.లీ.
2. అసిమమ్ స్యాంక్టమ్ - 6 - 30 మి.లీ.
3. బొరాక్స్ 30 - 30 మి.లీ.
4. మెర్క్‌సాల్ 30 - 30 మి.లీ.
5. రస్‌టాక్స్ 30 - 30 మి.లీ.
6. ఆర్సెనికమ్ ఆల్బమ్ 30 - 10 మి.లీ.

ఈ ఆరు మందులను మిశ్రమం చేసి (160 మి.లీ. అవుతుంది) ఒక మి.లీ. మందుకు 30 మి.లీ. వైమరాల్ (విటమిన్ల మిక్చర్) లేదా బి.కాంప్లెక్స్ కలిపి ఉదయం తిరిగి సాయంత్రం వరుసగా రెండు రోజులు జీవాలకు తాగించాలి. కలిపిన ఈ మందు మిశ్రమం విలువ ఒక మి.లీ. ఖరీదు సుమారు ఒక రూపాయి ఉంటుంది.

ఈ మందులతోపాటు వైమరాల్ కూడా ఇవ్వడం మేలు. ఖరీదు ఎక్కువని బి.కాంప్లెక్స్ వాడిన వారు వైమరాల్ వాడడమే మేలని అంటున్నారు.

ఈ రోగాలు రాకుండా ప్రతి నాలుగు వారాలకొకసారి ఒక మి.లీ. మందుల మిశ్రమానికి, 30 మి.లీ. వైమరాల్ లేదా 30 మి.లీ. బి.కాంప్లెక్స్, మందుకానీ కలిపి వాడాలి. గొర్రెలు మేకలలో ఈ రోగ నివారణకు కర్నాటక ప్రభుత్వం ప్రయోగాత్మకంగా టీకా మందు వాడి నివారించగలిగింది. అయితే ఈ టీకా మందును ఇంకా అమ్మకానికి విడుదల చేయలేదు.

(అన్నదాత, జనవరి 2006 నుంచి)

# ఈ మాసంలో వ్యవసాయం

## మామిడి

ఆర్.డి.టి. / యాక్షన్ ఫ్రటర్నా తరపున యిప్పటి వరకు లక్షలలో మామిడి అంట్లను వాటర్‌షెడ్ గ్రామాలలోని రైతులకు అందజేయడం జరిగింది. వాటి సంరక్షణ గురించి కొన్ని విషయాలు:మామిడి మొక్క నాటిన సంవత్సరం వరకు మొక్కకు ఒక మీటరు ప్రక్క కొమ్మలు రాకుండా జాగ్రత్త వహించాలి. ప్రక్క కొమ్మలు క్రింది నుంచి మామిడి చెట్టులా కాకుండా ఒక పొదలాగా పెరిగే అవకాశము ఎక్కువ. మొక్క మొదలు ఎత్తు పెరిగిన తరువాత కాండంపై 3-4 కొమ్మలు నలువైపులా వచ్చేలా వీలు కల్పించాలి. ఏపుగా పెరగని కొమ్మలు వెంటనే తీసివేయాలి. మొక్క పెరిగేటప్పుడు కొమ్మలు తీగలాగా సాగకుండా వంకరగా పెరిగే కొమ్మలను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. ఈ విధంగా చేసిన చెట్టుకు మంచి ఆకారము వస్తుంది. కొమ్మలు కత్తిరించినప్పుడు ఎండు తెగులు రాకుండా కాఫర్ ఆక్సీ క్లోరైడ్ / బ్లైటాక్స్ అను శిలీంద్రనాశిని పూయాలి. చెట్టు మూడు సంవత్సరముల వయస్సులో ఉత్తర-దక్షిణం వైపు గుబురుగా వున్న కొమ్మలను మధ్య మధ్యలో తీసివేయుటవల్ల సూర్యరశ్మి చెట్టులోపలకు ప్రవేశించుటకు బాగా వీలుకలుగుతుంది. దీనివల్ల చెట్టులోపలి కొమ్మలు కూడా త్వరగా ముదిరి పూతరావడానికి ఎక్కవ ఆస్కారం ఉంటుంది. ఇదే కాకుండా చెట్లపైభాగం పచ్చగా ఉండి, లోపలి భాగంలో సూర్యరశ్మి సోకని కొమ్మలు ఆకులు రాల్చి, కొమ్మలు ఎండిపోతాయి. ఇటువంటి చెట్లలో కాయలు పైపాటునే కనిపించి చెట్టులోపల ఏమాత్రం కాయవు. మొక్కలపై మూడవ సంవత్సరం నుంచి దిగుబడి పొందుటకు అవకాశం కలదు. సక్రమంగా పెంచని మొక్కలలో మసితెగులు, పిండి పురుగు, పొలుసు పురుగులు వచ్చి చెట్లకు ఎక్కువ నష్టం కలుగజేస్తుంది.

### కత్తిరింపు - పంట దిగుబడి.

వ్యాపార సరళిలో పెంచే బెనిషాన్ రకం సంవత్సరంలో మార్చి నుండి జూన్ మరలా సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో చిగురిస్తుంది. ఒకవేళ వాతావరణం అనుకూలించక, సెప్టెంబర్-అక్టోబర్ నెలల్లో చిగురించకుంటే, పూతరాని కొమ్మలు జనవరి-ఫిబ్రవరి నెలల్లో పూతతోబాటు చిగురిస్తాయి. మరలా జూలై-ఆగష్టు నెలల్లో చిగురు వస్తుంది. కానీ, ఈ చిగురు రావటం, చెట్టు బలం మరియు వాతావరణ పరిస్థితులపైన ఆధారపడివుంటుంది. ప్రతి సంవత్సరం పూతరాని రకాలు కాయ కోసిన వెంటనే చిగురు రాకపోవటం ముఖ్యకారణంగా చెప్పవచ్చును. బెనిషాన్ రకం మే నెలాఖరులో కాయలు కోసిన తర్వాత రెమ్మలను 10 సెం.మీ. (4 అంగుళాలు) వెనుకకు కత్తిరించి వారం రోజుల తర్వాత 2 శాతం యూరియా ద్రావణాన్ని (ఒక లీటరు నీటిలో 20 గ్రా. యూరియా కలుపుటవల్ల 2 శాతం అవుతుంది.) పిచికారి చేసినయెడల కత్తిరించిన రెమ్మలపై చిగురు బాగా వస్తుందని పరిశోధనలలో తెలియవచ్చింది. కత్తిరించిన ఒక కొమ్మకు 2-5 ప్రక్క కొమ్మలు వస్తాయి. ఈ కొమ్మలలో ఏపుగా పెరిగే రెండు కొమ్మలనుంచి చెట్టు మొత్తం 1 గ్రాము కార్బన్‌డిజిమ్ లేక 3 గ్రా. రాగిధాతు శిలీంద్రనాశిని మరియు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ మందును 1 లీ. నీటిని కలిపి పిచికారి చేసిన పురుగులను, కొన్ని రోగాలను అరికట్టవచ్చు.

వర్షాలు ఆరంభం కాగానే మొదటి దఫా ఎరువులు వేయుటవల్ల వచ్చిన చిగురు ఏపుగా పెరుగుతుంది. మంచి సంరక్షణలోవున్న చెట్లైతే కొత్త చిగుర్లు2, 3 దఫాలుగా కూడా వస్తాయి. ఈ విధంగా పంటకోత అయిన తర్వాత 10 సెం.మీ. రెమ్మలు కత్తిరించిన, కొత్త చిగురువచ్చి ప్రతి సంవత్సరం దిగుబడి పొందవచ్చు.

### కత్తిరింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

1. మొక్కలు నాటిన తర్వాత మొదటి 3 సంవత్సరాలలో పూత కొరకు కత్తిరించకూడదు. మెలి తిరిగిన కొమ్మలు, రెమ్మలు, ఎండిన మరియు రోగపూరితమైన కొమ్మలు మాత్రమే తీసేయ్యాలి.
2. పూతకొరకు 3 సంవత్సరాలు దాటిన తర్వాత మాత్రం కత్తిరింపులు చేపట్టాలి. ఈ రెమ్మలను 10 సెం.మీ.ల కంటే ఎక్కువగా కత్తిరించకూడదు.
3. సూర్యరశ్మి సోకుటకు వీలుగా ఉత్తర-దక్షిణంవైపు ఉన్న కొమ్మలను అక్కడక్కడా తీసేయ్యాలి.

మామిడిలో పరపరాగ సంపర్కం ద్వారా ఫలదీకరణ జరుగుతుంది. సాధారణంగా ఇది కీటకాలవల్ల జరుగుతుంది. ప్రకృతి సిద్ధంగా దాదాపు 50 శాతం ద్విలింగపూలు ఫలదీకరణం చెందకుండానే రాలిపోతాయి. ప్రకృతి సిద్ధంగా మామిడిలో అధికశాతం పిందె రాలిపోతుంది. ఇంతవరకు జరిగిన పరిశోధనల ప్రకారం కేవలం నూటికి ఒక్కటిచొప్పున ద్విలింగ పుష్పాలు మాత్రమే చివరివరకూ ఉండి కాయలుగా తయారౌతాయి. మిగతావి సహజంగా రాలిపోతాయి.

### మామిడిలో పిందె, కాయరాలడాన్ని అరికట్టడానికి :

1. చెట్ల పాదులలో మల్చింగ్ చేయుటవల్ల భూమిలో తేమ సమంగా వుంటుంది. చెట్లు నీటి ఎద్దడికి గురికావు.
2. కాయ పెరుగుతున్న దశలో నీరు పెట్టాలి.
3. పోషక పదార్థాలను ఆకులపై పిచికారి చేసి లోపాన్ని సవరించాలి.
4. పిందెకట్టిన సమయంలో పిందె రాలటాన్ని అరికట్టడానికి 20 పి.పి.యం. మోతాదులో ఎన్.ఎ.ఎ. పిచికారి చెయ్యాలి.

ప్రధాన చీడపీడలను సమగ్ర సస్యరక్షణ పద్ధతుల్ని అవలంబించాలి.

### నీటి తడులు - పిందె కట్టుట - పిందె రాలుట :

పిందె కట్టే సమయంలో తేమ ఒక మోస్తరుగా వున్నా సరిపోతుంది. పిందె కట్టిన తర్వాత భూమిలో తేమ సరిపడేలా తడులిస్తే పిందె, కాయరాలడం తగ్గిపోవడమేగాకుండా, కాయ సైజు మరియు నాణ్యత పెరుగుతుంది.

## వేసవిలో ప్రొద్దుతిరుగుడు :

నీటి ఆధారం క్రింద ప్రొద్దుతిరుగుడు పంటకు ఏప్రిల్ నెల అనువైన మాసము. ఈ పంటకు ఎకరానికి వేయవలసిన ఎరువులు :

1. పశువుల ఎరువు 5-10 బండ్లు.
2. రసాయన ఎరువులు - దుక్కిలో 100 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 25 కేజీల యం.ఓ.పి. మరియు 25 కేజీల యూరియా.
3. విత్తిన 30 రోజులకు, 45 రోజులకు, 20 కేజీల చొప్పున యూరియా పైపాలుగా వేయాలి.

### ప్రొద్దుతిరుగుడు పంటలో నెక్రోసిస్ తెగులు :

ఈ తెగులు పంటను అన్ని దశల్లో ఆశించి నష్టపరుస్తుంది. ఈ వ్యాధి ఆకులపై మొదలు పెద్ద మచ్చలతో ప్రారంభమై క్రమంగా అన్ని భాగాలకు వ్యాపిస్తుంది. తెగులు సోకిన మొక్క భాగాలు నల్లగా మారి కుళ్ళిపోతాయి. చిన్న వయస్సులోనున్న మొక్కకు ఈ తెగులు సోకితే ఆ మొక్క చనిపోతుంది. ఈ తెగులు లక్షణాలు ఆకులపైనేకాక కాండం పువ్వు అడుగు భాగం, ఆకు కాడమీద కూడా గుర్తించవచ్చు. నల్లని లేదా గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఉధృతిని బట్టి మొక్క పెరుగుదల పూర్తిగా తగ్గిపోయి క్రమంగా ఎండిపోతుంది.

ఈ తెగులు విత్తనం ద్వారా రాదు. కాని పంటకు విత్తేముందు విత్తనాన్ని గేచో (70 డబ్ల్యు.యస్.) అనే పొడి మందుతో విత్తిన శుద్ధి (5 గ్రాముల మందు ఒక కిలో విత్తనానికి) చేయుట వల్ల తామర పురుగులు ఒక నెల వరకు పంటను ఆశించకుండా చేస్తుంది.

### మార్చినెల నుండి మే నెల వరకు వర్షాధార పంట భూములందు రైతులు చేపట్టవలసిన ముఖ్యమైన కార్యక్రమాలు :

ప్రతి రైతు 2/3 పైర్లకొకసారి మట్టినమూనాలు తీసి పరీక్ష చేయించుకొనవలసి ఉంటుంది.

1. మీ పొలముయొక్క భూసార పరీక్షలు చేయించి ఏయే పంటలకు ఏయే ఎరువులు ఎంతెంత మోతాదులో వాడాలో తెలుసుకొని అనవసరమైన రసాయనక ఎరువుల వాడకం తగ్గించి వృధా సేద్యం ఖర్చు తగ్గించుకోండి. మట్టినమూనాల సేకరణలో పాటించవలసిన విషయాలు, వాటి వెంట పంపవలసిన వివరాలు, పరీక్ష కేంద్రము నుండి లభించే సూచనలు సలహాలు గురించి 2004 సంవత్సరము మే నెల మాసపు సమాచారం చూడండి. ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోనున్న గ్రామాలవారు వారివారి మట్టి నమూనాలను ధర్మవరం టౌన్ - బత్తలపల్లికి పోవు రస్తా ప్రక్కగా ఉన్న మార్కెట్ యార్డులోనున్న భూసార పరీక్షా కేంద్రమునకు పంపవలెను.
2. భూమి కోత, భూసార నష్టం అరికట్టడానికి, తేమను పరిరక్షించడానికి వర్షపునీరు / నీరు వృధాగా పొలము బైటకు పారిపోకుండా నిల్వ ఉండడానికి వాలుకు అడ్డంగా మట్టి / గుళకరాళ్ళ / రాళ్ళ కట్టలు వేసుకోవాలి.
3. కుంట కట్టలు యిదివరకే వేసుకున్న రైతులు, ఎక్కడన్నా తెగిపోయిన దగ్గర కట్టను భద్రపరచుకోవాలి. కట్టడాల్లో రాళ్ళు వదులుగా ఉంటే వాటిని తగువిధంగా పాదించి గట్టి పరచుకోవాలి.
4. లోతు దుక్కి : ప్రతి రెండు సంవత్సరాల పంటల తర్వాత వేసవి కాలంలో తొలకరి వానలు పడిన వెంటనే లోతుదుక్కి చేసిన భూమి, నీటిని ఎక్కువగా పీల్చుకొని తేమను నిల్వ ఉంచుకుంటుంది. దీని వలన పైరుకు లాభమౌతుంది.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.

☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990